

# హంసపాదు

రచన : దాసరి సుబ్రహ్మణ్యం

యౌవ్వనంలో వున్న మానవుల ప్రాణాలకి, ప్రాణాంతకంగా పరిణమించే సమస్యలు యీ ప్రపంచంలో రేండే రెండు; అందంగల ఆడదీ; డబ్బుగల మగాడూ!

ప్రమీల, రామ్మూర్తికి ప్రాణగొడ్డంగా తయారయిందంటున్నా నంటే ఆమె అందంగలదని, మీరిట్టే గ్రహించగల రనుకుంటాను. పోతే రామ్మూర్తి డబ్బు గలవాడు కాకపోవడంవల్ల, ప్రమీలకే కాక, యింకే స్త్రీకిన్నూడా, యీ నాటి వరకూ, కనీసం ఓరెండోరకం సమస్యగా కూడా తయారవలేక పోయాడు.

రామ్మూర్తి మగాడు కనకా, యింగి తజ్ఞానం వున్నవాడు కూడా కనక — ప్రమీల అందం చూసే ప్రేమించి వుంటాడని మరే మగాడైనా యిట్టే గ్రహించ గలడు.

తెలివిగల ఆడవాళ్లు, తెల్ల కాకుల్లానే; వున్నా కనబడరని రామ్మూర్తికి తెలియందికాదు, అందుకనే 'నీతెలివితేటల్నీ, బుద్ధిబలాన్నీ చూసి నిన్ను ప్రేమిస్తున్నాను.' అని, కేశవరావులా, అతడు ప్రమీలతో అనలేక పోయాడు.

స్త్రీ, పురుషుడి ముందు ప్రదర్శించేదీ, అతడు గుర్తించి మెచ్చుకోవాలనుకునేదీ; తన తెలివితేటల్ని కాదు; అందాన్ని! యీ ప్రకృతి రహస్యాన్నీ, జీవిత కషాయాన్నీ, రామ్మూర్తి ఎప్పుడో గ్రహించాడు; చవిచూశాడు.

రామ్మూర్తీ, కేశవరావూ ఒకే వూరు వాళ్లు, స్నేహితులు కూడా. వాళ్లయిళ్లని ఓచిన్న ప్రహారీగోడ వేరుపరుస్తోంది; వాళ్ల హృదయాలని ఓపెద్ద అడ్డుగోడ ప్రమీల రూపంలో ఎడంచేస్తోంది. అయినా వాళ్లు స్నేహితుల్లానే ప్రవర్తించే వాళ్లు. తప్పనిసరై, కాలేజీలో చేరేందుకు కేశవరావు మద్రాసు వెళ్లిన తరవాత వాళ్ల వుత్తర ప్రత్యుత్తరాలు 'మైడియర్ ఫ్రెండ్' అంటూనే ప్రారంభ మయ్యేవి.

రామ్మూర్తిలో డబ్బులేని లోపాన్ని, తెలివితేటలూ, చొరవా, సాహసం సరి చేసినై. ప్రమీల, కేశవరావు వైపుకే మొగ్గ తోందనీ, కేశవరావు తన ప్రేమని గురించికూడా ఆమె తో చెప్పేశాడనీ తెలిసికూడా రామ్మూర్తి అంతగా నిరుత్సాహ పడలేదు.

"నువ్వు ప్రేమిస్తున్నట్టు చెపితే — ప్రమీల ఏమన్నది?" ఆరోజున కేశవరావుని, రామ్మూర్తి ప్రశ్నించాడు.

"ఏమన్నది .... అదోలానవ్వి, గదిలోకి వెళ్లింది."

రామ్మూర్తి అంతటితో పూరుకున్నాడు. ఆమె వెళ్లింది వంటగదిలోకో, పడక గదిలోకో కూడా అతడు అడగదల్చుకోలేదు. 'అదోలానవ్వి' అని కేశవరావు చెప్పడంలోనే — అక్కడ ఏబల్లచాటునో, కుర్చీమాటునో వుండి మన్మధుడు బారు చేసి, బాణాల్ని ప్రమీల మీ ద వ ది లి వుంటాడని రామ్మూర్తి గ్రహించాడు. జరిగిన పొ ర పా ట ల్లా, కేశవరావు ఆతూణీరధ్వనిని వినలేకపోవడం.

రామ్మూర్తికి, కేశవరావును హ డ ల కొట్టేందుకు ఉక్కదమంచి అవకాశం దొరికినట్టు తోచింది. అన్నాడు—

"మనం ఎలాంటి టెలాంటి స్త్రీలనైనా ప్రేమించ వొచ్చు. కాని, ఆవిషయం వాళ్లతోనే చెప్పదలుచుకుంటే — ఒకటి గుర్తుంచుకోవాలి.... కాదు, చూడాలి."

"ఏమిటే?" రెప్ప వా ల్చ కుండా చూస్తూ కేశవరావు ప్రశ్నించాడు

"వాళ్లకాళ్లని చెప్పులేకండా ముందు చూడాలి. తరవాత..."

"నాకుబాగా అర్థం అవడంలేదు!"

"అయితే మరోమారు అడుగు !"

రామ్మూర్తి తన అంచనా తలకిందులైందని వారం రోజుల్లోనే గ్రహించాడు. కేశవరావు తను చెప్పిందివిని, భయపడి పోతాడనీ, ప్ర మీ ల యింటివైపుకే పోడనీ అతడు ఆశించాడు కాని, ఓనాడు తను బజారునుంచి వస్తూంటే, వాళ్లిద్దరూ పక్కపక్కగా న డు చు ని మాట్లాడుకోవడం కనబడింది.

రామ్మూర్తి తన భవిష్యత్తు చిక్కులో చిక్కుకుందని గ్రహించాడు. ప్రమీల అందంగల యువతి! ఆమె గుర్తుకొస్తే రాత్రిళ్ళు అతడికి నిద్ర ప ట్టే ది కా దు; పగలు ఏపనిచేసేందుకూమనస్కరించదు.

అతడు తర్కించు కున్నాడు. ప్రమీల కంటే అందంగల వాళ్ళు యీలోకంలో యికలేరా? వుండొచ్చనీ; వున్నారనీ కూడా అతడికి తోచింది. అయినా అందుబాటులో — అందులోనూ పక్కవీధిలో వున్నదల్లా ప్రమీల ఒక్కర్తే!

వాటర్లూకి ముందు నెపోలియన్‌లా, రామ్మూర్తి ఎత్తుమిదఎత్తు ఆలోచించాడు; వేశాడు. కాని తనహృదయంలోని ప్రేమ భారంకన్న, కేశవరావు జేబులోని మనీ పర్సుభారం, ప్ర మీ ల ను తనవైపుకు గుంజు కుంటూన్నట్టు అతడికి తోచింది.

కేశవరావు కా లే జీ లో చేరేందుకు మద్రాసు వెళ్లడం నిశ్చయమైంది. తల

వని తలంపుగా పరిస్థితులు తనకు అనుకూలమవుతూన్నవని రామ్మూర్తికి తోచింది. శివధనుస్సును విరిచేందుకు సమయానికి రాముడు రాకుండా వున్నట్టయితే; కనీసందాన్ని ఎత్తగలిగిన రావణుడి చరిత్ర మరోవిధంగా వుండేది గదా!

కేశవరావును రైలెక్కించేందుకు తోడుగా రామ్మూర్తి వెళ్లాడు. టిక్కెట్టు తీసుకుని యిద్దరూ ప్లాట్‌ఫారం మీదికి వెళ్లారు. మెయిల్ వచ్చేందుకు యింకా పదినిమిషాల టైముంది.

రామ్మూర్తి చాలా చాలా మాట్లాడాడు. కేశవరావూ – ప్రమీలలమధ్య ఖాళీస్థలం ఎంతవరకూ వున్నదో – లేక, ఆఖాళీ అనేది లేకుండానే పోయిందో తెలుసుకోవాలని అతడి ఆదుర్దా. ఒక సారి ఆఖాళీ, ఆహద్దూ, గీటూ ప్రేమికులు అధిగమించడం అంటూ జరిగితే; ఆ తరవాత వాళ్ళు భార్యాభర్తలయే అవకాశాలే ఎక్కువని రామ్మూర్తికి తెలుసు.

"మళ్లీ ఎప్పుడైనా .... ఆ సంగతి తెచ్చావా?" రామ్మూర్తి అడిగాడు.

"అహాఁ! అదా...ఎప్పటిలానే నవ్వుతుంది."

కేశవరావు జవాబు రామ్మూర్తి హృదయాన్ని ప్రశాంత పరిచింది. అంతా మించిపోలేదనీ; అసలు ఏమీ మించిపోవడం అంటూ జరగలేదనీ అతడు గ్రహించాడు.

"అందమైన ఆడవాళ్లని చూడాలంటే మెడ్రాసే వెళ్లాలి. అక్కడ యిలాంటి ప్రమీలలు పమిటలేకుండా తిరుగుతున్నా ఎవరూ గమనించరు. కాని, మనకి యిక్కడ...."

"అవును! చాలా మంది అలాగే చెప్తారు...."

కేశవరావు, ప్రమీలని గురించి తను అలా అన్నందుకు కోపం తెచ్చుకుంటాడనుకున్న రామ్మూర్తికి, అతడి జవాబు ఆశ్చర్యంగా తోచింది. బహుశా అతడికి తనలా ప్రమీల మీద పూర్ణప్రేమ లేదేమో అనుకున్నాడు. కాని ప్రమీలకి...

రామ్మూర్తి తీరని సమస్యల భారంతోనే, స్టేషనునుంచి యింటికి వచ్చాడు. ప్రస్తుతానికి కేశవరావు అడ్డంకి అంటూ లేకపోయినా, తనపని ఎలా సానుకూలం అవుతుందో అతడికి ఎంత ఆలోచించినా తేలలేదు.

'ప్రమీల కేశవరావు వైపే ఎందుకు మొగ్గుతోంది?' రామ్మూర్తి ప్రశ్నించుకున్నాడు. నిలువునా, అడ్డంగాతిప్పి అదే ప్రశ్నకి అనేక రకం జవాబులు వెతుక్కున్నాడు. ఎంత ఆలోచించినా ప్రమీల కేశవరావుని ప్రేమించడానికి 'డబ్బు' తప్ప మరేకారణం అంతగా అతడికి కనబడలేదు.

తను కనీసం ఓసన్నపాటి గొలుసు కానీ, ఓచౌకరకం జార్జెట్ చీరకానీ ప్రమీలకు కొనిపెట్టలేదు. వున్న రెండెక

రాల పొలాన్నే. తన ఫిఫ్తుఫారం చదువుతో, వున్న తెలివితేటల్తో కాపాడు కుని వృద్ధిచేసుకో వలసిన ఆర్థికస్థితి. పోతే కేశవరావు సంగతివేరు — పాతి కెకరాలకు వారసుడు.

రామ్మూర్తిలో రకరకాల ఆలోచనలూ, వింత వింత భావాలూ పొట్లతీగల్లా మెలి కలు మెలికలు తిరిగినై. తనకన్న అందంలో తక్కువవాడూ, బల హీనుడూ, తెలివి హీనుడూకూడా అయినవ్యక్తి; కేవలం ఆస్థిబలంతో, తను ప్రేమిస్తున్న యువతిని ఆక్రమించుకో గలిగేస్థితిలో వుండడం, అతడికి చాలా బాధనీ, ద్వేషాన్నీ కలిగించింది.

ఆరాత్రి కలత నిద్దర్లో; సూళ్లూరు పేట దగ్గిర పట్టాలమీదినుంచి కెనెడి యన్ ఇంజన్ కట్టదిగడం వల్ల కేశవ రావు ఎక్కిన మెయిల్ పడ్డట్టూ, అందరూ సజీవంగా కొద్ది దెబ్బలతో బతికి బయటపడినా ఒక్క కేశవరావు మాత్రం గుర్తించనంత భయంకరంగా, ముక్కలు ముక్కలై మరణించినట్టూ అతడికి కలవొచ్చింది. వులిక్కిపడి మగత నిద్రనుంచి లేచి మంచంమీద కూర్చున్నాడు. యదార్థం తెలిసిన తర వాత అతడికి మరి నిద్ర పట్టిందికాదు.

కాలం గడుస్తోంది. రామ్మూర్తి అవ కాశం చిక్కినప్పుడల్లా ప్రమీల యింటికి వెళ్తున్నాడు. అంత ఆస్థి వున్నవాడి ప్రేమను తెలుసుకున్న ప్రమీలతో తన ప్రేమ సంగతి చెప్పేందుకే అతడివాళ్ల జలదరించేది. ప్రేమనిగురించీ, పెళ్లిని గురించీ అన్యాపదేశంగా ఎన్నిచెప్పినా ఆమె అదోలా నవ్వి గదిలోకి వెళ్లడం అటుంచి, కనీసం వినేందుకూకూడా ఆసక్తి కనబరిచేదికాదు. మన్మధుడు మగాడైనా, యీకాలపు యువతుల్లా శ్రీమంతుల సవారీ అంటేనే మోజుపడు తూన్నట్టుగా రామ్మూర్తికి తోచింది. ఎంత శృంగారానికీ, సరసానికీ అనుకూలమైన పరిస్థితుల్లోనూ అతడు; రామ్మూర్తి ఎదురుగా వున్నప్పుడు, ప్రమీల మీద పుష్పబాణాల్ని కాదుగదా; కనీసం ఓ అవిటి మొగ్గనికూడా ప్రయోగించలేదు.

ఆరోజున రామ్మూర్తికి, కేశవరావు నుంచి ఓపెద్ద వుత్తరం వచ్చింది. చదువు దామని వుత్తరం మడతలు విప్పుతూన్న అతనికి - ఆమడతల్లోనుంచి, ఓ చిన్న ఫొటో నాజూగ్గా బయటికి తొంగి చూసింది.

'నాజూగ్గా' అనేప్పటికే, ఎవరికైనా ఆఫొటో స్త్రీదని తెలిసి పోతుందిగదా? మగాడైతే నాజూగ్గా ఎందుకు చూస్తాడు; వాడు నిలువుగానో, పక్కవాటుగానో; ఏదైనా కళ్లతో మాత్రమే చూస్తాడు!

రామ్మూర్తి విస్మితుడయాడు. జాగర్తగా ఫొటోని అరిచేతిలో పెట్టు కుని చూశాడు.

ఆ ఫొటోలోని స్త్రీ మూర్తి నిండు యౌవ్వనంలోనే వుంది. నాజూగ్గా- అతి నాజూగ్గా; ఒక్క కళ్లతోనేకాక, అదోలా మలిచిన పెదాలతో, ఖజానాఖాతులా

ముందుకు వంచీవంచ నట్టుంచిన శంఖంలా మెలితిరిగిన మెడతో, వస్త్ర హీనంగా వదిలిన లోతరనాభితో; శస్త్రం చేసితప్ప విడదీయలేము అనుకునేలా బిగువుగా, శరీరంలో కలిసిపోయిన మెరిసే ఛోలీ రవికెతో, ఏ చువ్వలూ అడ్డంలేని కిటికీలో కుండా బయటికి —ప్రపంచంలోకి చూస్తోంది.

ఆ ఫొటోకింద అంటించిన చిన్న తెల్ల కాయితంమీద, కేశవరావు నాలుగైదు మాటలు మాత్రం రాశాడు.

'శ్నాప్!....అదృష్టం!.... జీవితరహస్యం! నిన్ను నమ్ముతున్నాను. ఏపరిస్థితిలోనూ ప్రమీలకు...'

శకునిలా తల పంకించి, షెర్లక్ హోమ్స్‌లా ఎగిరి గంతేసి రామ్మూర్తి గదిమధ్య అటూ యిటూ పచార్లు ప్రారంభించాడు. అంత ఆస్తిగల కేశవరావూ తన గుప్పెట్లో నిస్సహాయుడుగా చిక్కుకుపోయాడని రామ్మూర్తి పరవశత్వం చెందాడు.

ఆవుత్తరం,ఫొటోతీసుకుని వీధిమలుపు తిరగడం, ప్రమీల వాళ్లయింటి తలుపు తట్టడం అంతా, వాయు మనోవేగాల్లో రామ్మూర్తి నిర్వహించాడు. తలుపు తెరిచిన ప్రమీలతల్లిని తోసుకుంటూనే అతడు సరాసరి ప్రమీల కూర్చున్న వరండాలోకి వెళ్ళి పోయాడు. 'ఏమిటీ?' అన్నట్టు ప్రమీల చులకనగా రామ్మూర్తిని నఖశిఖ పర్యంతం పరీక్షగా చూసింది. అనర్హుడైన ప్రేమికుడంటే ఆడదానికీ; అప్పుతీర్చలేని ఆసామీ అంటే అప్పిచ్చినవాడికీ; చులకనకాక మరేమిటి!

"కేశవరావు బుద్ధిమంతుడే!" కూర్చుంటూనే రామ్మూర్తి ప్రారంభించాడు. ప్రమీల పమిట సర్దుకుని, పక్కకు తల తిప్పింది.

"అదంతా మెడ్రాసు వెళ్ళకముందు. కాని....యిప్పుడు."

తిరిగి ప్రమీల తనవైపుకు తల తిప్పేసరికి రామ్మూర్తి ఫొటోపట్టుకున్న చేతిని ఆమెవైపుకు చాచాడు.

"ఏమిటి? ఆ!" ప్రమీల ఫొటో అందుకున్నది.

"ఆఫొటో, కింద రాసినసంగతీ...."

రామ్మూర్తి విజయ సూచకంగా నవ్వాడు. ఆనవ్వు, శంఖారావంలా ప్రమీల చెవుల్లో ప్రతిధ్వనించింది.

"నిజమా?" ప్రమీల ఫొటోవంకా కిందరాసివున్న పంక్తుల వంకా చూస్తూనే జీరగా అడిగింది.

"నిజం! అతడిమాటల్లోనే....."

"నన్ను ప్రేమించానని, ఒకటికి నాలుగుసార్లు చెప్పాడు!"

ప్రమీల కంపితస్వరంతో అన్నది. ఫొటో ఆమె చేతిలోనుంచిజారి కింద పడింది.

"అందంగల అవివాహితని, మెడమీద తలకాయ వున్న ప్రతి మగాడూ కాంక్షిస్తాడు? అలాగే చెపుతాడు. పోతే-

ఎవడు ప్రేమిస్తున్నాడో; ఎవడు మొక్కుబడి తీర్చుకునేందుకు చూస్తున్నాడో, ఆమె మెదడును వుపయోగించి తెలుసుకోవాలి!"

"యింత మోసం!" ప్రమీల రోషం, విషాదం కలిసిన గొంతుతో అన్నది.

"అంతా అయిపోయిన తరవాత... యిప్పుడు" రామ్మూర్తి. తీక్షణంగా చూస్తున్న ప్రమీల మొహంకేసి చూసి తక్కున ఆగిపోయాడు.

"అంతా ఏమైపోయింది? నన్ను గురించి ఏమనుకుంటున్నావ్? నువ్వు నువ్వు ..."ఆమె రోషకషాయ నేత్రాలు, రామ్మూర్తిలో భయాన్నీ, కింకర్తవ్యతా మూఢత్వాన్నీ కలిగించినై.

"నిన్నుమాత్రం నమ్మేదెట్లా! పైగా అతడి శత్రువులు ఎవరైనా అలా పంపి వుండొచ్చు."

రామ్మూర్తికి ఆమాటల్తో, ప్రమీల మీద జాలికలిగింది. స్త్రీగనక, ఏదో ఒక పురుషుణ్ని; కేశవరావుని కాకపోతే, మరోకాకయ్యాని ఎప్పుడో ఒహప్పుడు నమ్మితీరక తప్పదు, మరణంలానే; అదీ; జీవితంలో స్త్రీ పురుషులు ఎప్పుడో ఒకప్పుడు తప్పనిసరిగా ఎదుర్కొనే తీరవలసిన సమస్య! రామ్మూర్తిలో జాలీ, కారుణ్యం నిండుగా తొణికిసలాడినై.

"మీ పెద్దమ్మ కొడుకు మెడ్రాసులోనే చదువు తున్నాడు గదా! అతడికిరాస్తే?" రామ్మూర్తి కేవలం స్నేహితుడిలా మాట్లాడాడు.

"రాస్తే?" ప్రమీల తిరిగి ప్రశ్నించింది. ఓక్షణకాలం ఆగి మళ్లీఅన్నది. "నేనే వెళ్తాను. నువ్వూ వస్తావా?"

రామ్మూర్తి తల వూపాడు.

ఆరాత్రి మెయిల్‌కే ప్రయాణం. రామ్మూర్తి తనస్థితి చాలా శోచనీయంగా తయారైందని బాధపడ్డాడు. తను ఏదో విజయశంఖారావం పూరించేందుకు పోతే; ఫలితం మరోలా తయారైంది.

ప్రమీల యింకా కేశవరావుని ప్రేమిస్తోందా? రామ్మూర్తి మళ్లీ తర్కించుకున్నాడు. వైఫల్యభారంతో కుంగిపోయే అతని మనస్సుకి, ప్రమీల కేశవరావుని కాక, అతడి పాతికెకరాల ఆస్తినే ప్రేమిస్తున్నట్టుగా తోచింది. బహుశా ముప్పై ఎకరాల ఆస్తి గలవాడు ఎదురైతే తప్ప ఆమె కేశవరావుని ప్రేమించకుండా వుండలేదను కున్నాడు. అయినా తాను సరే అన్నాడు కనక ఆమెతో పాటు మెడ్రాసు వెళ్ళకతప్పదు. తన దురదృష్టానికి చింతిస్తూనే అదృష్టంమీద కొంతభారం వేశాడు.

ప్రమీల రైల్లో అంతగా మాట్లాడలేదు. సాయంత్రం ఐదు గంటలకు మెడ్రాస్ సెంట్రల్ స్టేషన్లో దిగగానే; ఆచుట్టూ కనబడిన వాతావరణానికి ఆమె కళవెళ పడ్డది.

తన చిన్నవూళ్లో అందంగల దాన్ననే గర్వంతో, తలఎత్తుకుని ధీమాగా తిరిగే ఆమెకు బస్‌లో టిక్కెట్ యిచ్చిన ఆడకండక్టరు ఎదుటనే తలదించుకోవలసి

నంత భయం, తన అందంమీద అను మానం కలిగింది. రామ్మూర్తి జరుగుతూన్న మార్పుల్ని గమనిస్తూనేవున్నాడు.

తీరా, పెత్తల్లి కొడుకువుండే రూమ్‌కి వెళితే అతను సినిమా కెళ్లాడని, పక్క రూంవాళ్ళు చెప్పారు. ప్రమీల నిర్వేదంగా రామ్మూర్తి వంకచూసింది.

"మనమూ యీలోపల సినిమాకి వెళ్లి వద్దాం."

ప్రమీల వినీవిననట్టే తలవూపింది. రామ్మూర్తిలో ఏదో ఆశ మొలకెత్తినట్ల యింది. తనని అదృష్టదేవత కరుణించేదీ లేనిదీ గంటల్లో, నిమిషాల్లో తేలి పోతుందనుకున్నాడు.

షో ప్రారంభించి పావుగంట అయింది. టిక్కెట్లు కొని యిద్దరూ కుర్చీల్లో కూర్చున్నారు. కథ అగమ్య గోచరంగానే కనబడింది. మరో పావుగంట తరవాత, హఠాత్తుగా తెరమీద ఓ చువ్వల్లేని కిటికీని తెరిచి ఓ యువతి నాజూగ్గా - ఖజానా బాతులా మెడ మెలి తిప్పి, సూటిగా - ఎదురుగా చూస్తూ నిల బడింది.

ప్రమీల అదోలా చిన్న కేక పెట్టింది. రామ్మూర్తి కుర్చీలో అటూ యిటూ కదిలి ఓ దీర్ఘ నిశ్వాసం విడిచాడు. పక్కన కుర్చీల్లో వున్న ఒకరు, పక్కవాడితో 'రెహనా రొంబ బ్యూటిఫుల్' అంటున్నాడు.

ఇంటర్‌వల్ లైట్లు వెలిగినై. కుర్చీలో నుంచి లేచి చకచకా బయటికి నడిచిపోతున్న ప్రమీల వెనక, నేరంచేస్తూ పట్టుపడిన దొంగలా, పుట్టుబానిసలా తల వంచుకుని రామ్మూర్తి నడిచాడు.

పేవ్‌మెంటు మీద ఆమె నిలబడింది. వెనక్కి తిరిగి రామ్మూర్తి వంక చూసింది.

"ఈర్ష్య నిన్ను యింతనీచ స్థితికి దిగలాగిందా! ఎవరో సినిమాస్టారు తన ప్రియురాలనీ, తనేఫొటో తీశాననీ చెప్పేంత బుద్ధిహీనుడా కేశవరావు? ఛీ!"

ప్రమీల కాళ్ళ చెప్పులు పేవ్‌మెంటు మీద ప్రతిధ్వనించినై. అక్కడే వున్న రిక్షాలో ఎగిరికూర్చుని-టిసిరకేనూ, వీధీ, రూమ్ నెంబరూ వాడితో చెప్పేసింది.

రామ్మూర్తి స్థాణువులా అక్కడే చూస్తూ నిలబడ్డాడు కేశవరావు ఎంత బుద్ధిహీనుడో రుజువైన నిమిషమే; తనకి దుర దృష్టంగా మారడం అతణ్ని నిలువునా కుంగదీసింది. ప్రమీల ఎక్కిన రిక్షాని కదలకుండా పట్టుకోవాలనీ, ఆమెతో ఏదో చెప్పాలనీ, అతడిచేతులూ, హృదయం తపనపడినై. కాని, కాళ్ళు తప్ప అతని సర్వేంద్రియాలూ స్తబ్ధత వహించినై. కళ్ళుతెరిచే; ఆవిమూసి నప్పుడు తోచేంత గాఢాంధకారంలో - అతడు రోడ్డుకు అడ్డంగా, బస్సులూ, ట్రాములూకి నడిచాడు.